వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 247 గురువారం | 04 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



# రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు

ప్రమాణ స్వీకారం చేయించిన ఉప రాష్ట్రపతి ధనఖర్

రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నిక

2 లో..

# సెంటిమెంట్ తుక్కుగూడ




- కాంగ్రెస్‌కు కలిసొచ్చిన ప్రాంతం
- అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఇక్కడే శ్రీకారం
- పార్లమెంట్ ఎన్నికల వేళ ఇక్కడినుంచే శంఖారావం
- జనజాతర పేరిట భారీ బహిరంగ సభ
- కేంద్రంలోనూ హస్తం పార్టీదే అధికారం అంటూ ధీమా

కాంగ్రెస్ పార్టీలో సెంటిమెంట్ కాలం నడుస్తోంది. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో చేవెళ్ల సెంటిమెంట్ ఉండేది. చేవెళ్ల నుంచే ఆయన పాదయాత్ర చేసి విజయం సాధించారు. వైఎస్సార్ ఏ పని చేసినా అక్కడినుంచే మొదలు పెట్టేవారు. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయఢంకా మోగించిన ఆ పార్టీకి ఇప్పుడు తుక్కుగూడ సెంటిమెంట్ పట్టుకుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోనియా గాంధీ ఇక్కడినుంచే ఆరు గ్యారెంటీలను ప్రకటించారు. ఇది బాగా కలసి వచ్చింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అందుకేనేమో దేశ ముఖచిత్రాన్ని మార్చివేసే కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డ నుంచే ఎన్నికల శంఖారావం పూరించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి పెట్టిన తుక్కుగూడలోనే 'జనజాతర' పేరిట ఈ నెల 6న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ఇక్కడినుంచే జాతీయ స్థాయి మేనిఫెస్టోను కూడా విడుదల చేయబోతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్




వివరాలు 2లో..



8లో

# ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

పాల్గొన్న ప్రముఖులు

మహాన్నదానాలతో పరవశించిన భక్తులు




2లో

# అప్రమత్తతతో విధులు నిర్వహించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



8లో

# మానవత్వం చాటుకున్న మంత్రి సీతక్క

నిరుపేద యువతి పెళ్లికి చేయూత

కృతజ్ఞతలు తెలిపిన స్థానిక కాంగ్రెస్ నాయకులు

# సెంటిమెంట్ తుక్కుగూడ



**కాంగ్రెస్‌కు కలిసొచ్చిన ప్రాంతం**

**అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఇక్కడే శ్రీకారం**

**పార్లమెంట్ ఎన్నికల వేళ ఇక్కడినుంచే శంఖారావం**

**జనజాతర పేరిట భారీ బహిరంగ సభ**

**కేంద్రంలోనూ హస్తం పార్టీదే అధికారం అంటూ ధీమా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయఢంకా మోగించిన కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ పట్టుకుంది. అదే తుక్కుగూడ. గత ఎన్నికల్లో తుక్కుగూడా నుంచే కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రకటించింది. ఆరు గ్యారెంటీలను సోనియా గాంధీ ఇక్కడినుంచే ప్రకటించారు. ఇది బాగా కలసి వచ్చింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ తెలంగాణలో అధికారం హస్తగతం చేసుకుంది. అందుకేనేమో మరోమారు పార్లమెంట్ ఎన్నికల ముందు ఇక్కడి నుంచే కాంగ్రెస్ ఎన్నికల సభ నిర్వహించింది. దేశ ముఖచిత్రాన్ని మార్చివేసే కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డ వీరీద నుంచే ఎన్నికల శంఖారావం పూరించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇక్కడే జాతీయస్థాయి మేనిఫెస్టో విడుదల చేయబోతున్నారు.



## గతంలో చేవెళ్ల..

దివంగత వైఎస్సార్ హయాంలో చేవెళ్ల సెంటిమెంట్ ఉండేది. చేవెళ్ల నుంచే పాదయాత్ర చేసి విజయం సాధించారు. ఆయన ఏ పనిచేసినా అక్కడినుంచే మొదలు పెట్టేవారు. ఇప్పుడు కాంగ్రెస్‌కు తుక్కుగూడ బాగా కలసివచ్చింది. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్.. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనకు చరమగీతం పాడాలనే కృతనిశ్చయంతో ఉంది. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన మేనిఫెస్టోను తెలంగాణ గడ్డవిరీద, అదీ శాసనసభ ఎన్నికలకు సమరశంఖం పూరించిన తుక్కుగూడ వేదికగానే విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ సెంటిమెట్‌ను బాగా నమ్ముకున్న కాంగ్రెస ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న ధీమాతో ఉన్నారు. ఇదే జరిగితే తెలంగాణ కాంగ్రెస్‌కు కూడా కలసివచ్చే అంశంగానే చూడాలి.

## జన జాతర..

శాసనసభ ఎన్నికలకు తుక్కుగూడ నుంచే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ సమరశంఖం పూరించింది. తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబరు 17న తుక్కుగూడలో విజయభేరి పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించింది. విజయభేరి వేదిక విరీద నుంచే సోనియగాంధీ ఆరు గ్యారెంటీలను ప్రకటించారు. ఆమె ప్రకటించిన ఆరు గ్యారెంటీలు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కొలువుదీరడంతో సెంటిమెంట్ గా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు కలిసివచ్చిన తుక్కుగూడ నుంచే లోక్‌సభ ఎన్నికలకు సమరశంఖం పూరించాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెల 6వ తేదీన తుక్కుగూడలో 'జనజాతర' పేరిట నిర్వహించే భారీ బహిరంగ సభలో మేనిఫెస్టోతో పాటు తాము అధికారంలోకి వస్తే అమలు చేయనున్న అయిదు గ్యారంటీలను కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ప్రకటించనుంది. అందుకే సీఎం రేవంత్ సహా మంత్రులు తుక్కుగూడా ఏర్పాట్లపై దృష్టి సారించారు.

## సభకు 10 లక్షల మంది..

జనజాతర పేరిట నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కనీసం 10 లక్షల మంది హాజరు కానున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఆదిలాబాద్ మొదలు ఆలంపూర్ వరకు, జహీరాబాద్ నుంచి భద్రాచలం వరకు అన్నిగ్రామాలు, పట్టణాలు, నగరాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇప్పటికే తుక్కుగూడ జన జాతర సభ ప్రాంగణాన్ని సందర్శించి సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తుక్కుగూడలోని 60 ఎకరాల విశాలమైన మైదానంలో జన జాతర బహిరంగ సభను కాంగ్రెస్ నిర్వహించనుంది. మైదానం పక్కనే వాహనాల పార్కింగ్‌కు సుమారు 300 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది.

## జెండా ఎగురేస్తాం..

తుక్కుగూడ వేదికగా నిర్వహించిన విజయభేరి సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నాడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని కుండబద్దలు కొట్టి చెప్పారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి ప్రజలంతా ఆహ్వానితులేనని ప్రకటించారు. అవే మాటలను ఆయన ఎన్నికల ప్రచారంలో పదే పదే పునరుద్ఘాటించారు. రేవంత్ రెడ్డి చెప్పినట్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. డిసెంబరు 9కి రెండు రోజులు ముందే ఏడో తేదీన రేవంత్ రెడ్డి సర్కార్ కొలువుదీరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తుక్కుగూడ వేదికగానే.. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో జూన్ 9 న ఎర్రకోటపై జెండా ఎగురవేస్తామని ప్రకటించనున్నట్లు సమాచారం. శాసనసభ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి చెప్పిన ప్రతి మాట ప్రజల్లో బలమైన ముద్ర వేయడంతో పాటు నిజమవడంతో ఇప్పుడు ఆయన చేసే ప్రకటనలపై ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అందుకే తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ ఎన్నికల సమరశంఖం పూరించబోతోంది. ఇక్కడే దేశానికి పలు హామీలు ఇవ్వనుంది. మోడీ నాయకత్వంలో దేశం ఎలా దెబ్బతిన్నదీ వివరించబోతున్నది. కాంగ్రెస్ వస్తే ఏమేం మంచి పనులు చేస్తారో కూడా ప్రకటించబోతున్నది. మోడీని ఎందుకు దూరం పెట్టాలో కూడా వివరించబోతోంది.

## కాంగ్రెస్‌కు జీవనమరణ సమస్య..

కాంగ్రెస్ పార్టీకి సంబంధించినంతవరకు ఈ ఎన్నికలు జీవనమరణ సమస్య లాంటివి. ఈ ఎన్నికల్లో ఓటమి పాలయితే ఇక మోడీని నిలవరించలేమని కాంగ్రెస్ పార్టీకి తెలుసు. అందుకే ఈ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా ఇండియా కూటమి కలసి పోటీ చేస్తోంది. సీట్ల షేరింగ్‌లో కూడా కాంగ్రెస్ కొంత పట్టువిడుపులతో ముందుకు సాగుతోంది. రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే తుక్కుగూడను ప్రచారానికి ఎంచుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితరలు సమావేశానికి వస్తున్నారు. దక్షిణాదిలో పట్టు సాధించాలని చూస్తున్న బీజేపీకి, మోడీకి చెక్ పెట్టేందుకే ఇక్కడ సభను నిర్వహించాలన్న ఆలోచన కూడా ఉండివుంటుంది. మొత్తంగా తుక్కుగూడ కలసివస్తుందా లేదా అన్నది చూడాలి.

# అప్రమత్తతతో విధులు నిర్వహించాలి



**వరంగల్ వాయిస్, క్రైం :** లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వహించాల్సి ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లల్లో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బందితో పాటు సెక్టార్ విభాగం ఎస్సైలతో గురువారం సీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లూకోల్ట్స్ సిబ్బంది నిర్వహించిన విధులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీపీ పరిశీలించారు. వారికి అప్పగించిన విధులు, నిర్వహిస్తున్న తీరుతెన్నులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాల్సిన బాధ్యత బ్లూకోల్ట్స్ సిబ్బందిపై ఉంటుందన్నారు. వచ్చిన ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో నిజాయిగా దర్యాప్తు చేసి స్టేషన్ అధికారికి పూర్తి నివేదిక అందజేయడం ద్వారా బాధితులకు తగు న్యాయం జరుగుతుందన్నారు. తద్వారా ప్రజలకు పోలీసులపై గౌరవం పెరుగుతుందన్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది తమ పరిధిలో ముందస్తు సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఇలాంటి ముందస్తు సమాచారం నేరాల నియంత్రణతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. త్వరలో జరుగనున్న లోక్ సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నిబద్ధతతో విధులు నిర్వహించాల్సి ఉంటుందని వెల్లడించారు. సిబ్బంది పనితీరుపై అధికారుల దృష్టి ఉంటుందని మరిచిపోవద్దన్నారు. మీరు అప్రమత్తతతో ఉంటే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడం ఈజీ అవుతుందన్నారు. ఈ సమావేశంలో పరిపాలన అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితేందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఇన్ స్పెక్టర్ సంతోష్, శ్రీనివాస్ రెడ్డి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాజ్యసభ సభ్యులుగా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం ఉదయం ఆయన చేత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ధనఖర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్, రాజ్యసభ సభ్యులు పలువురు రవిచంద్రకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రవిచంద్ర కుటుంబ సభ్యులను ఉపరాష్ట్రపతి ధనఖర్ కు పరిచయం చేయగా వారు ఆప్యాయంగా అందరిని పలకరించి ఫోటోలు దిగారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇనుగుర్తి గ్రామంలో 1964 మార్చి 22న జన్మించిన వద్దిరాజు.. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ ఈస్ట్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. గతంలో బండ ప్రకాశ్ రాజ్యసభకు రాజీనామా చేయడం వల్ల ఖాళీ అయిన సీటు వద్దిరాజును వరించిన విషయం తెలిసిందే. 2022 మే 24న ఈ పదవికి ఎన్నికైన వద్దిరాజు కేవలం రెండేండ్లే ఎంపీగా కొనసాగారు. ఇటీవలే వద్దిరాజు పదవీకాలం పూర్తవడంతో ఆయనకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆశీస్సులతో రెండో సారి అవకాశం కల్పించారు.

## కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో మండలంలోని 10 గ్రామాలలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా నిర్వహించి జిల్లాలో ఉత్తమ స్థాయిలో నిలిచిన లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి రిజ్వానా ఫీల్డ్ అసిస్టెంట్ చిరంజీవి, నాగారం పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డం కోమల, పోచారం పంచాయతీ కార్యదర్శి కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ మురళికి, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, ఎంపీఓ భాస్కర్, ఏపీవో ఇందిర వారిని ఘనంగా సన్మానించారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తనదైన శైలిలో పనిచేస్తూ ఉపాధి హామీ సిబ్బందికి పని కల్పిస్తూ మండలానికి మంచి పేరు తీసుకువచ్చిన శుభ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించడం జరిగిందని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ రజనీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్ సుమలత, 10 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, 10 గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాప్‌పై పోలీసుల దాడి



**వరంగల్ వాయిస్, కేయూ :** ఎలాంటి అనుమతులు లేకుండా ఐఎంఎఫ్ మద్యం అక్రమ విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ బృందం విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక నగర్ లయోలా స్కూల్ పరిధిలోని అంగిడి వెంకటేశ్వర్లు అలియాస్ రమేష్ (35) అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్‌షాప్‌పై పోలీసులు దాడి చేశారు. అతని వద్ద నుంచి ఐఎంఎఫ్ మద్యం మొత్తం రూ.6,400 గల సొత్తును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. దాడి పూర్తయిన తర్వాత నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చర్య కోసం కేయూసీ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఎస్సై బి.శరత్, టాస్క్ ఫోర్స్ బృందం, కేయూ పోలీసులు పాల్గొన్నారు.

## శ్రీ సాయిబాబా మందిర నిర్మాణానికి భూమి పూజ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని గాంధీ చౌక్ లో నూతనంగా నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబా సత్సంగ్ మందిర్ కు ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. ఈ వేడుకలో గ్రామ ప్రజలు సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

### శ్రీ మత్స్యగిరి స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే..

మండల కేంద్రంలోని శ్రీ మత్స్య గిరి స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే జీఎస్సాఆర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ పట్టు వస్త్రాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ కమిటీ కందగట్ల రవి, గన్ను వేణుగోపాల్, కంబత్తుల ప్రకాష్, భాషని వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మండల అధికార ప్రతినిధి చిందం రవి, నాయకులు బాసని మార్కండేయ, మారేపల్లి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్స్ సిద్ధం చేయాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి గురువారం జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాల పిల్లలకు యూనిఫామ్ (డ్రెస్సెస్) స్టిచ్చింగ్ పై జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలోని కేజీబీవీ, టీఎస్ఎంఎస్, ప్రభుత్వ పాఠశాలలో (లోకల్ బాడీస్) టీడబ్ల్యు పీఎస్, ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్స్, టీఆర్ఐఈఎస్, మోడల్ స్కూల్స్ తదితర (872) విద్యాసంస్థలలో చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులకు యూనిఫామ్, డ్రెస్సెస్ (స్టిచ్చింగ్) చేయించేందుకు ప్రణాళికలు వెంటనే సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం డిమాండ్ అంచనా మేరకు (మెజర్మెంట్స్) కొలతలు, తీసుకొని మ్యాచింగ్ ప్రకారం వచ్చే విద్యా సంవత్సరంలోపు అందించేందుకు పక్కా ప్రణాళికతో సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం (1563) మంది డీఆర్డీఏ, స్వయం సహాయక బృందాల సభ్యులు ముందుకు వచ్చారని, వారి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 47 వేల 453 మంది విద్యార్థిని, విద్యార్థులకు రెండు జతల చొప్పున (94,906) జతల యూనిఫామ్, డ్రెస్సెస్ (స్టిచ్చింగ్) చేయించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ ఉన్న సంబంధిత గ్రామాలు, పట్టణాలలోని స్వయం సహాయక సంఘాల నుంచి ప్రభుత్వ సూచనల మేరకు యూనిఫామ్స్ కుట్టించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ట్రైబల్ వెల్ఫర్ , మైనార్టీ, సంక్షేమ శాఖల అధికారులు నరసింహస్వామి, బాలరాజు, ఎర్రయ్య, శ్రీనివాస్, అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ, మెప్మా పీడీ విజయ, డీఆర్డీఏ పీడీ నళిని, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

### ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని మహబూబాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ అన్నారు. గురువారం నర్సంపేట నియోజకవర్గం చెన్నరావుపేట మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మొదటి సారిగా మండలానికి వచ్చిన సీతారాం నాయక్ కు బీజేపీ శ్రేణులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అహర్నిశలు తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలను, తనను నమ్ముకున్న అందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకు వెళ్లి ఘనమైన విజయాన్ని సాధిస్తామన్నారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి బీజేపీకి అత్యధిక మెజారిటీ వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొనీ ముందుకు వెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభంపాటి పుల్లారావు, సీనియర్, యువ నాయకులు గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు


## వరంగల్ ఎంపీ టిక్కెట్ దళిత క్రైస్తవులకు కేటాయించాలి

### పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మరుపట్ల అబ్రహం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ ఎంపీ టిక్కెట్ దళిత క్రైస్తవులకే కేటాయించాలని తెలంగాణ పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మరుపట్ల అబ్రహం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి క్రైస్తవులు, క్రైస్తవ సంఘాల నాయకులు ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. క్రైస్తవులకు అనుకూలమైన కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కన్నీటితో ప్రార్థించిన చరిత్ర ఉందని తెలిపారు. తమ వంతు బాధ్యతగా ఎంతో మంది ప్రజలను చైతన్యవంతులు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేస్తే వరంగల్ ఎంపీ టికెట్ దళిత క్రైస్తవుల ఇవ్వకుండా క్రైస్తవులను చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపించడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునరాలోచన చేసి దళిత క్రైస్తవులకు వరంగల్ ఎంపీ టిక్కెట్ కేటాయించాలని, లేకుంటే క్రైస్తవులు తగిన గుణపాఠం చెప్పక తప్పదని మరుపట్ల అబ్రహం అన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే



**వరంగల్ వాయిస్, పరకాల :** కొత్త, పాత కార్యకర్తలు భేదాభిప్రాయాలు లేకుండా సమిష్టిగా పనిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో పరకాల నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం గ్రామ, వార్డు, డివిజన్, పట్టణ, మండల స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఎమ్మెల్యే రేవూరి దిశా నిర్దేశం చేశారు. మారిన రాజకీయ సమీకరణాలు నేపథ్యంలో ఏఐసీసీ వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నందున పార్టీ నిర్ణయానికి కట్టుబడి ప్రతీ కార్యకర్త, వ్యక్తిగత అభిప్రాయాలను పక్కకు పెట్టి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా, బీఆర్ఎస్ ను బొందపెట్టాలి, బీజేపీని ఎదగనివ్వకూడదనే ధ్యేయంతో కలిసి కట్టుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్నదొమ్మాటి సాంబయ్యకు పార్లమెంట్ టిక్కెట్ ఇవ్వాలని కోరుకున్నామని బీజేపీ కేంద్ర నాయకత్వం వివిధ రాష్ట్రాలలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చే కుట్రలను పసిగట్టి రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ, బీజేపీల ఎత్తుగడలను పసిగట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దొమ్మాటి సాంబయ్యకు సముచిత గౌరవం ఇస్తామన్నారు. మంద కృష్ణ మాదిగకు టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు ఇదే కడియం శ్రీహరి వద్దకు వచ్చి ఏబీసీడీ వర్గీకరణపై మాట్లాడి చంద్రబాబును ఒప్పించి ఏబీసీడీ వర్గీకరణ తీర్మానాన్ని అసెంబ్లీలో చేసిన విషయం నీవు మరిచినా మాదిగ సమాజం మర్చిపోదన్నారు. నీవు బీజేపీ ముసుగులో మాట్లాడుతున్నావని సమాజం గ్రహిస్తుందని రేవూరి ప్రకాశ్ రెడ్డి విమర్శించారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి

## కలెక్టర్, డీపీఓలకు సర్పంచుల వినతి



**వరంగల్ వాయిస్, రేగొండ :** పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టామని సర్పంచులు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. రేగొండ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ సొంత పైసలతో అభివృద్ధికి అప్పులు చేసి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతుండడంతో ఉమ్మడి రేగొండ, గోరికొత్తపల్లి మండలాల సర్పంచులు బిల్లులు ఇప్పించాలంటూ గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, డీపీఓలకు వినతి పత్రాన్ని అందజేశారు. రేగొండ ఉమ్మడి మండలాల సర్పంచులు గురువారం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దాసరి నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రేగొండ సర్పంచ్ ఏడునూతుల నిశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరుపుకొని కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లి వినతి పత్రాలను అందజేశారు. ప్రభుత్వ ఆదేశం ప్రకారం అప్పటి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేస్తే నిధులు మంజూరు చేస్తామని ఉత్తర్వులు జారీ చేయడంతో పోటీలు పడి గ్రామాల అభివృద్ధికి లక్షల్లో అప్పులు చేసి పాటుపడ్డామన్నారు. ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో ఒక్కొక్కరికి సుమారు రెండు అంకెల చొప్పున లక్షల రూపాయలు పెండింగ్ లో ఉండిపోయాయని వెంటనే పెండింగ్ బిల్లులను ఇప్పించాలంటూ కలెక్టర్ భవేష్ మిశ్రాకు సర్పంచుల సంఘం నాయకులు మొర పెట్టుకుంటూ వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పెండింగ్ బిల్లుల మంజూరుకు ఇటీవల ప్రభుత్వం నుంచి (పీఎఫ్ఎంఎస్) నిధులు వచ్చిన తమకు అందజేయలేదని సర్పంచులు కలెక్టర్ కు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసిన సర్పంచుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని, వెంటనే ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమని ఉమ్మడి మండల సర్పంచులతో పాటు సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నారాయణరెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఫోరం అధ్యక్షుడు దాసరి నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాజీ సర్పంచ్ ఏడునూతుల నిశిధర్ రెడ్డి, లింగంపల్లి ప్రసాద్ రావు, బానోతు బిక్యానాయక్, బూడిదల సుధాకర్, పాతపెల్లి సంతోష్, అంబాల చందు గౌడ్, దండబోయిన సంతోష్, మారపెల్లి ఇంద్ర, బాపురెడ్డి, చిగురుమామిడి రజిత రాజు, మెరుగు విజయకుమార్, దగ్గు సంధ్యారాణి వెంకటేశ్వరరావు, బండారి కవిత దేవేందర్, లింగంపల్లి, శ్వేత రాజు, సూదనబోయిన రజిత, సర్పంచులు పాల్గొన్నారు.

## హోటల్, మొబైల్ షాప్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో నూతన మొబైల్ షాప్ ను, అదే విధంగా జంగాల పల్లి క్రాస్ రోడ్ వద్ద భూక్య జవహర్ ఎస్ వీ గ్రాండ్ హోటల్ ను గురువారం రాష్ట్ర మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## గోదావరి కరకట్ట స్థలాల పరిశీలన




**వరంగల్ వాయిస్, ములుగు :** గోదావరి నది కరకట్ట స్థలాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని గోదావరి నది పరివాహక ముంపు ప్రాంతాలలో కరకట్టల నిర్మాణం కోసం స్థలాలను గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. ఏటూరునాగారం మండలం రాంనగర్ ప్రాంతంలో 102 ఎకరాల స్థలాన్ని 6 కిలోమీటర్ల కరకట్ట నిర్మాణం కోసం 2022లో సర్వే పూర్తి అయ్యిందని, మంగపేట మండలంలో పొదమనూర్ ముంపు ప్రాంతాలకు 2.5 కిలోమీటర్ల నూతన కరకట్ట నిర్మాణం కోసం 25 ఎకరాల స్థల సర్వే 2022లో పూర్తైన వివరాలు సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం కలెక్టర్ ఏటూరునాగారం మండలం ముళ్లకట్ట గ్రామంలో మిరప తోటలను సందర్శించారు. ఈ సందర్భం రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాలానుగుణంగా పంట మార్పిడి చేయాలని సూచించారు. రైతులకు లాభదాయకమైన పంటలపై అవగాహన, నాణ్యమైన విత్తనాల గురించి అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ భాస్కర్, ఎస్ఈ మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జగదీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చందర్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి వేణు, జేఈ, ఏఈ, తదితరులు పాల్గొన్నారు...

## కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యం
### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో పరకాల నియోజవర్గంలో బీఆర్ఎస్ కు భారీ షాక్ తగిలింది. గీసుగొండ మండలం హర్జతండా బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ అంగోతు కవిత-మాహబూబ్ నాయక్, అనంతారం గ్రామం కార్యకర్తలు, దామెర మండలం నుంచి సింగరాజు పల్లె, దుర్గంపేట గ్రామాల మాజీ సర్పంచ్ లు, ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు సుమారుగా 150 మంది పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్బంగా ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మొన్నటి ఎన్నికల వరకు ప్రజలను మోస పూరిత మాటలతో మభ్యపెడుతూ కాలం వెల్లదీశారని అన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని తెలిసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించి వరంగల్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురి రెడ్డి, గీసుగొండ మండల ఎంపీపీ భీమగాని సౌజన్య, మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, దామెర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి, వివిధ మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## బ్లేడ్లతో కాకతీయ కళాతోరణం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఓరుగల్లును పరిపాలించిన కాకతీయ మహారాజుల ద్వారం అయిన కాకతీయ కళాతోరణాన్ని బ్లేడ్లతో అబ్బురపరిచే విధంగా తయారు చేసి తన కార్యాలయంలో భద్రపరిచారు. చూసిన వారందరూ చాలా అద్భుతంగా ఉందని కొనియాడారు.

## పలు వివాహాలకు హాజరైన ఎమ్మెల్యే జీఎస్సాఆర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కొప్పుల గ్రామంలో మారిశెట్టి భాగ్యలక్ష్మి, కొమురయ్య కూతురు వివాహం, మైలారం గ్రామానికి చెందిన నూనె తిరుపతి కూతురు వివాహం, శాయంపేట మండల కేంద్రానికి చెందిన పాడి రాజిరెడ్డి కుమారుడి వివాహాలకు హాజరై నూతన వధూవరులను భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు ఆశీర్వదించారు. వీరి వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మారేపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి, భాషని మార్కండేయ, మాదిరెడ్డి ప్రపంచరెడ్డిలతో పాటు గ్రామ కమిటీ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



వరంగల్ వాయిస్, మహాదేవపూర్ : మండలంలోని అంబటిపల్లి గ్రామానికి చెందిన బండం ఎల్లారెడ్డి కుమార్తె మౌనిక రెడ్డి-పుప్పిరెడ్డి సనత్ రెడ్డి వివాహ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, పీఏసీ ఎస్సై చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, మహదేవపూర్ మండల్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కటకం అశోక్, ఎన్ఎస్ యూఐ మండల ప్రెసిడెంట్ రంజిత్ రెడ్డి, మండల కాంగ్రెస్ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పుప్పిరెడ్డి వెంకటరెడ్డి, రామ్ రెడ్డి పాల్గొన్నారు.

## పోషన్న మృతిపై మంత్రి సురేఖ దిగ్భ్రాంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ అటవీ ప్రాంతంలోని కొండపల్లి గ్రామంలో ఏనుగు దాడిలో కారు పోషన్న అనే వ్యక్తి మృతి చెందడం పట్ల అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బాధిత కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్ గ్రేషియాను చెల్లిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గుండా ఆసిఫాబాద్ జిల్లాల్లోకి ప్రవేశించిన ఏనుగు వరుస దాడుల నేపథ్యంలో చింతలమానేపల్లి, పెంచికల్ పేట్, బెజ్జూర్, దహెగాం ప్రాంతాల్లో 144 సెక్షన్ ను విధించినట్లు మంత్రి సురేఖ తెలిపారు. అటవీ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని స్పష్టం చేశారు. సాధారణ పరిస్థితి నెలకొనేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సురేఖ ప్రజలకు సూచించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వైస్ ఎంపీపీ



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రానికి చెందిన గడ్డం వెంకన్న కుమార్తె వివాహానికి వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పెరుమాండ్ల గుట్టయ్య గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జెల్ల యాకయ్య, పెరుమాండ్ల మల్లేశం, తాళ్ల సతీష్, మహేష్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన గుడి వంశీధర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** భారత రాష్ట్ర సమితి రాష్ట్ర యువనేత నేత, లింగాల గణపురం జడ్పీటీసీ సభ్యుడు గుడి వంశీధర్ రెడ్డి గురువారం మధ్యాహ్నం హైదరాబాదులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయనకు ముఖ్యమంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి నాయకత్వంలో పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్య గెలుపు కోసం కష్టపడి పని చేస్తానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కంచు కోటైన ఉమ్మడి వరంగల్ జిల్లాలో మళ్లీ పూర్వ వైభవం తెచ్చేందుకు తాను కృషి చేస్తానన్నారు.. రఘునాథపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గుడి వంశీధర్ రెడ్డి కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగారు. త్వరలోనే తాను కాంగ్రెస్ సైనికుడిగా సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యదర్శిగా లక్ష్మి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు పోరెడ్డి లక్ష్మి నియమిస్తూ గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తానని ఆమె తెలిపారు. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గం జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుడతానని ఆమె వివరించారు. ఈనెల 6న తుక్కుగూడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. తన నియమానికి సహకరించిన స్టేషన్ ఘన పూర్ నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిరా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి, మాజీ జడ్పీటీసీ లింగాల జగదీశ్ చందర్ రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిర, జిల్లా, మండల పార్టీ నాయకుల అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్య గెలుపు కోసం మహిళలు నడుం బిగించాలని ఆమె కోరారు. పార్లమెంటు నియోజకవర్గం లో అత్యధికంగా మహిళల ఓట్లు ఉండడం పట్ల ఈసారి కచ్చితంగా కావ్య గెలుపు ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు

## ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** అంతర్జాతీయ స్థాయిలో 2023–24 విద్య సంవత్సరానికి గాను నిర్వహించిన సీ నాప్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో నారాయణ విద్యాసంస్థలకు చెందిన 113 మంది విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా నక్కలగుట్ట నారాయణ స్కూల్ బ్రాంచ్ కు చెందిన విద్యార్థులు ఆరు బహుమతులు కైవసం చేసుకున్నారు. గురువారం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి బహుమతులు పొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను ముందుంచడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రిజ్వానా, ఆర్ఐ వేణు, ప్రిన్సిపాల్ రమేష్, సి నాప్స్, ఇంచార్జి కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ నేతలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుండే బోయిన సృతన్ గౌడ్– అర్చన వివాహానికి బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గట్టు వేణు, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడిపెల్లి పోషాలు, మల్కపేట గ్రామ అధ్యక్షుడు జల్లెల రజినీకాంత్, సీనియర్ కార్యకర్తలు వన్నాల రమేష్, సర్వ్ అశోక్, యాట భాస్కర్, బండారి రవీందర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# బాలల విద్యతో భవిష్యత్తుకు పునాది

### సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బాలల విద్య నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు అంధకారంలో మునిగిపోతాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్య ఎమర్జెన్సీని ప్రకటించాలని, పూర్తి కాలం పనిచేసే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ తార్నాక ప్రాంతంలోని సత్యోదయం కాన్ఫరెన్స్ హాల్ లో స్టేట్ లెవల్ ఎన్ జీఓ కాన్స్ లేషన్ ఆన్ చిల్డ్రన్ ఇష్యూస్ ఇన్ తెలంగాణ, రాష్ట్రస్థాయి బాలల సమస్యలపై అలయన్స్ ఫర్ చైల్డ్ రైట్స్ అధినేత దరిపల్లి బాలచంద్రం అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ అశోక్ పాల్గొని మాట్లాడారు. నిధులతో పని లేకుండానే చేయగలిగిన పాఠశాలలో వ్యవస్థీకృత మార్పులు, విద్యార్థులందరికీ నాణ్యమైన సమాన విద్యను అందించడానికి విద్యా సంక్షోభ నివారణ కమిటీలను వేయడం, డ్రాపవుట్స్ ను అరికట్టి బాల కార్మిక రహిత తెలంగాణగా తీర్చిదిద్దడం, ప్రైవేటు విద్య నియంత్రణ చేసి, కామన్ స్కూలుకు దారులు పడేలా చేయాలని తెలిపారు. ప్రధాన వక్త ఎంవీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్రం వెయ్యి మార్కులకు కేవలం 479 పాయింట్లతో దేశంలోని 36 రాష్ట్రాలలో 31వ స్థానంలో నిలవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ కన్నా తక్కువ పాయింట్లు పొందిన ఐదు రాష్ట్రాలు బీహార్, నాలుగు ఈశాన్య రాష్ట్రాలు మాత్రమే ఉన్నాయని, అభ్యసన ఫలితాలలో 240 పాయింట్లకు తెలంగాణ రాష్ట్రంకేవలం 36 పాయింట్లతో దేశంలో 35వ స్థానంలో నిలిచిందన్నారు. ఒక్క మేఘాలయ మాత్రమే తెలంగాణ కన్నా వెనుకబడి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ దక్షిణ భారతదేశ కోఆర్డినేటర్ రసూల్ అహ్మద్, యూనిసెఫ్ తెలంగాణ కోఆర్డినేటర్ డేవిడ్ లతో పాటు రాష్ట్రంలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మై చాయిస్ ఫౌండేషన్– రమేష్ రెడ్డి, సిరి సొసైటీ అధ్యక్షుడు– పరికి సుధాకర్, డే కేర్ సొసైటీ– సుధాకర్ లతో పాటు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సుమారు 128 మంది పాల్గొని బాలల సంరక్షణ సమస్యలపై చర్చించి తీర్మానాలు తయారు చేశారు.

# ప్రధాని మోడి మళ్లీ గెలిస్తే నిరంకుశ పాలనే



**వరంగల్ వాయిస్, సుబేదారి :** మతతత్వ భారతీయ జనత పార్టీని వరంగల్ పార్లమెంటు స్థానంలో ఓడించే సత్తా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని డా.కడియం కావ్యకు ఉందని తెలంగాణ మైనార్టీ సంక్షేమ సమైఖ్య (టీడబ్ల్యూఎంఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అఖీల్ పాషా తెలిపారు. గురువారం సుబేదారిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకారుల సమావేశంలో మహ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి బీజేపీ దేశంలో మతతత్వాన్నిపెంచిపోషిస్తుందని, తద్వారా దేశంలో అనేక ప్రాంతాలలో మతవైషమ్యాలు పెరిగిపోయాయని వాపోయారు. దేశంలో రాబోయే ఎన్నికలు చాలా కీలకమని, ప్రధాని మోడి మూడోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం పతనమై, నిరంకుశ పాలన వస్తుందన్నారు. కడియం శ్రీహరి సుదీర్ఘకాలం టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలలో అనేక ఉన్నతమైన పదవులను అలంకరించిన, మచ్చలేని నాయకుడు అని అన్నారు. బీజేపీ కుటిల నీతిని గ్రహించడం వల్లనే కాంగ్రెస్ పార్టీలో చేరారని, దాంతో లౌకిక వాదానికి బలం చేకూరుతుందని వివరించారు. బీజేపీ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాలలో దళితులపై దాడులు జరుగుతున్న, సాముహిక మానభంగాలు జరుగుతున్న ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ నోరు మెదపడని విమర్శించారు. ఉత్తరప్రదేశ్, హర్యాన రాష్ట్రాలలో బీజేపీ పాలకులు రిజర్వేషన్స్ రద్దు చేశారని, మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మార్చి మనువాదాన్నే తెస్తారని, మందకృష్ణ మాదిగ ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి బీజేపీని వ్యతిరేకించాలని హితవు పలికారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలలో ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతారని అన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు మహ్మద్ మజహర్ హుస్సేన్, సయ్యద్ ఆజీమ్ పాల్గొన్నారు.

## తుక్కుగూడ సభను జయప్రదం చేయండి

### కాంగ్రెస్ నేతల పిలుపు



**వరంగల్ వాయిస్, కాటారం :** హైదరాబాదు తుక్కుగూడలో ఈనెల 6న జరిగే జన జాతర కాంగ్రెస్ భారీ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులతో పాటు ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కాటారం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 13న జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అతిరథ మహారథులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు మేనిఫెస్టో హామీలను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఐటీ మంత్రి ఈ ప్రాంత అభివృద్ధి ప్రదాత దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనతో, పిలుపుతో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని కోరారు . జన జాతరలో 'పాంచ్ న్యాయ్' ఎన్నికల మేనిఫెస్టో హామీలను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ పంత కాని సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘురాం, కటకం అశోక్, ఓం సింగ్, అరుణ్ ఖాన్, లడ్డు సమ్మయ్య తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



**వరంగల్ వాయిస్ మరిపెడ :** దళారులు, వ్యాపారులను నమ్మి మోసపోకుండా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని విక్రయించాలని మరిపెడ ఏపీఎం రాములు రైతులకు సూచించారు. మరిపెడ మండలం వీరారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో సహజ గ్రామ మహిళా సంఘం ఏర్పాటు చేసుకున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులు వరి ధాన్యం కొనుగోలు తూకంలో పాత పద్ధతులను అవలంబిస్తూ మోసం చేస్తున్నారని అన్నారు. అలాంటి దళారు వ్యాపారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకోవాలని రైతులను కోరారు. ఇందుకు మద్దతు ధరగా ఏ గ్రేడ్ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 చొప్పున రైతుల వద్ద వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులంతా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ రుక్మిణి, సీఏ గాజుల రాణి, మహిళా సంఘం అధ్యక్షురాలు సోమలక్ష్మి, కార్యదర్శి ఎల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు.

# గ్రీన్ వుడ్ పాఠశాలలో ఘనంగా జి ఫెయిర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని హంటర్ రోడ్ లో ఉన్న గ్రీన్ వుడ్ పాఠశాలలో నర్సరీ నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులలోని సామర్థ్యాన్ని వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా గురువారం నిర్వహించిన జి ఫెయిర్ విద్యార్థులనే కాకుండా తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకుంది. దీనిలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సబ్జెక్టులకు, వివిధ అంశాలకు సంబంధించిన ఎగ్జిబిట్స్, చాట్స్, విద్యార్థులు వివరించిన విధానం వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను చాటి చెప్పాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ జి.భరద్వాజ నాయుడు, చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలో గ్రీన్ వుడ్ పాఠశాల ముందుంటుందని తెలియజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జీ.ఎం.ప్రభు కుమార్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజులా దేవి, ఉప ప్రధానోపాధ్యాయులు ఎల్ మహేందర్, రుమానా, ఏవో మురళి, హెచ్ఆర్ వాసు, ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## రాజ్యాంగ రక్షణ యాత్రకు అపూర్వ స్వాగతం




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాజ్యాంగం ప్రమాదంలో ఉందని , మనువాధుల నుంచి రక్షించుకోవాడానికి ప్రజలందరూ కులామతాలకు అతీతంగా ఏకం కావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్రకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. సుధాకర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే విధానాన్ని బీజేపీ ప్రభుత్వం విడనాడాలని, లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 17మందికి జరిమానా


**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో మొత్తం 17మందిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఏ షుకూర్ వెల్లడించారు. ఈ 17మందిని కోర్ట్ లో హాజరు పరచగా రూ.16,900 జరిమానా విధిస్తూ రెండో తరగతి మేజిస్ట్రేట్ రమేష్ బాబు తీర్పునిచ్చారన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన తొమ్మిది మందికి రూ.6000 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి సిరికొండ పరామర్శ



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** మండల పరిధిలో ఇటీవల మరణించిన మియాపురం లక్ష్మి బాయి కుటుంబ సభ్యులను గురువారం తెలంగాణ రాష్ట్ర తొలి శాసన సభాపతి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## క్యాంప్ కార్యాలయం కేంద్రంగా ప్రజాపాలన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు, పూజలు నిర్వహించి గృహ ప్రవేశం చేశారు. ఎమ్మెల్యే మురళి నాయక్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ప్రభుత్వ క్యాంప్ కార్యాలయ కేంద్రంగా ప్రజా పాలన కొనసాగుతుందని, ప్రజలు తమ సమస్యలు, వినతి పత్రాలు ఇవ్వడానికి ఇక్కడికే రావాలని సూచించారు. అన్ని మతాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతోనే కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు పూజలు నిర్వహించామన్నారు. నియోజకవర్గంలో మండు వేసవిలో ఎదురయ్యే తాగునీటి ఎద్దడి సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సంజీవరావు అన్నారు. గురువారం మండలంలోని ఫత్తేపురం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యం విక్రయించుకోని ప్రభుత్వం ఇస్తున్న గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, సాధారణం రకానికి రూ.2183 పొందవచ్చన్నారు. ధాన్యం విక్రయాలు చేసే రైతులు తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ బుక్, ఆధార్ కార్డు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్, ఏఈవో భరత్ చంద్ర, సీసీ పద్మావతి, సీఏలు యమున, సంధ్య, నిర్వాహకులు సంధ్య, రజిత, అరుణ, లక్ష్మీ నర్సమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు సీఐ రవిరాజ్ కౌన్సిలింగ్



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక పరకాల పోలీస్ స్టేషన్ లో సీఐ రవి రాజ్ పరకాల, నడికూడ మండలాల్లోని రౌడీషీటర్లకు పోలీస్ స్టేషన్ కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల వేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు, ఎలాంటి నేరాలకు పాల్పడదని సత్ప్రవర్తనతోనే కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా పాల్పడినట్లు తెలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

## పేదింటి ముస్లిం మహిళలకు రంజాన్ సామాగ్రి పంపిణీ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, 63వ డివిజన్ లో గురువారం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఎండీ నేహాల్ ఆధ్వర్యంలో 63 డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలి ముఖ్యఅతిథిగా హాజరై పేదింటి ముస్లిం మహిళలకు రంజాన్ పండగ సందర్భంగా రంజాన్ సామాగ్రిని పంపిణీ చేశారు. ప్రతి పేద ముస్లిం కుటుంబం రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కార్పొరేటర్ విజయశ్రీ రజాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల సంతోష్, రతన్, సుధీర్, శ్రీనివాస్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అరూరి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలో బీజేపీవరంగల్ పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్ జన్మదినం సందర్భంగా ఆత్మకూరులో కేకు కట్ చేసి జన్మదిన వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గట్టు వేణు, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మామిడిపల్లి పోషయ్య, మల్కపేట బూత్ అధ్యక్షుడు జిల్లెల్ల రజినీకాంత్, ప్రధాన కార్యదర్శి వన్నాల రమేష్, సర్వు అశోక్, యాట భాస్కర్, బండారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## మాజీ కార్పొరేటర్‌ను పరామర్శించిన కొండా మురళీధర్ రావు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ గత కొద్ది రోజుల క్రితం చిన్న ఆపరేషన్ జరిగిన సందర్భంగా గురువారం కొండా మురళీధర్ రావు మాజీ కార్పొరేటర్ స్వగృహానికి విచ్చేసి ఆరోగ్య పరిస్థితిలను తెలుసుకొని ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలని కొండా మురళీధర్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్ నవీన్ రాజు, పద్మా గంగాధర్, చింత కృష్ణ, దాసరి రాజేష్, వేముల నాగరాజు, మేకమల్ల వెంకటేష్, గణిపాక సుధాకర్, దేవర ప్రసాద్, చింత మధు పాల్గొన్నారు.

# తాప్సీ పెళ్లి వీడియో వైరల్






సెంట్‌గా రకుల్ ప్రీత్ సింగ్ , సోనారిక, మీరా చోప్రా వంటి హీరోయిన్లు పెళ్లి చేసుకుని.. వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. ఇప్పుడు వారి బాటలోనే మరో హీరోయిన్ తాప్సీ కూడా నడిచింది. తాప్సీ సీక్రెట్‌గా తన బాయ్‌ఫ్రెండ్ మథియాస్ బోని పెళ్లాడింది. తాప్సీ- మథియాస్ బోల పెళ్లి మార్చి 23న అతి కొద్ది మంది సన్నిహితుల సమక్షంలో సీక్రెట్‌గా జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ పెళ్లికి సంబంధించిన వీడియో ఒకటి ఇప్పుడు లీకైంది. ఈ లీకైన వీడియో సోషల్ మాధ్యమాలలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన వారంతా.. నూతన దంపతులకు శు భాకాంక్షలు తెలుపుతూ.. 'హ్యాపీ మ్యారీడ్ లైఫ్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వీడియోలో తాప్సీ సంప్రదాయ దుస్తుల్లో, కూలింగ్ గ్లాస్ పెట్టుకుని సరదాగా డ్యాన్స్ చేసుకుంటూ పెళ్లి వేదికపైకి చేరుకోగా.. ఆమె బాయ్ ఫ్రెండ్ మథియాస్ బో ఆమెకు హగ్‌తో స్వాగతం పలికారు. ఆ తర్వాత ఇద్దరూ దండలు మార్చుకొని ఒక్కటయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో బాగా వైరల్ అవుతోంది. మథియాస్ బోతో తాప్సీకి ఎప్పటి నుండో పరిచయం ఉంది. వారి ప్రేమను కుటుంబ సభ్యులు వ్యతిరేకించినట్లుగా అప్పట్లో వార్తలు కూడా వచ్చాయి. ఇంట్లో అందరినీ ఒప్పించే.. తన ప్రియుడిని పెళ్లాడతానని తాప్సీ చెప్పినట్లే.. ఇప్పుడు అందరి సమక్షంలో తన వివాహాన్ని ముగించింది.

# నిఖిల్ తాజా చిత్రం 'స్వయంభూ' నభానటేశ్ స్టిల్ విడుదల



టాలీవుడ్ యువ కథానాయకుడు నిఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా.. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో సంయుక్తా మేనన్ కథనాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ కోసం సంయుక్తా మేనన్ హార్స్ రైడింగ్ కూడా నేర్చుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా సెట్‌లోకి మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చింది. ఇప్పటికే నభా నటేష్ ఈ సినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇక తాజాగా నభా నటేష్ 'స్వయంభూ' సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చినట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా నభా సెట్స్‌లోకి అడుగుపెట్టిన వీడియోను ఎక్స్ వేదికగా పంచుకున్నారు.
కన్నడ నటి నభానటేష్ (ಔಜೀಶಿಠಜೀ ಔಜೀಬಿಃಬಠ) 'నన్ను దోచుకుందువటే' చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. రామ్‌పోతినేని హీరోగా నటించిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో విజయాన్ని అందుకున్నారు. 'సోలో బ్రతుకే సో బెటర్', 'డిస్కో రాజా', వంటి చిత్రాల్లో నటించిన ఆమె దాదాపు మూడేళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'స్వయంభూ'చిత్రంలో మరో నాయికగా నభా నటేష్ పేరుని ఖరారు చేశారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమేనంటూ తాజాగా సినిమాలో ఆమె లుక్‌కి సంబంధించిన వీడియోను విడుదల చేసిన చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. యుద్ధ నేపథ్య కథాంశంతో రూపొందుతోన్న ఈ యాక్షన్ డ్రామాలో నిఖిల్ ఓ యోధుడి పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇందుకోసం ఆయన మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ తదితర విద్యల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



## ఫ్యామిలీ స్టార్ విడుదలకు సిద్ధం

టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ మృణాళ్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' పరశురాం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు సభ్యులు ఈ సినిమాకు యు/ఏ సర్టిఫికేట్‌ను జారీ చేశారు. ఇక రన్‌టైం విషయానికి వస్తే.. ఈ మూవీ 150 నిమిషాలు ఉన్నట్లు చిత్రయూనిట్ వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ.. 150 నిమిషాల సంపూర్ణ వినోదాన్ని అందించడానికి 'ఫ్యామిలీ స్టార్' రేపు మీ ముందుకు వస్తున్నాడు. అంటూ మేకర్స్ రాసుకోచ్చారు. మరోవైపు ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ కూడా స్టార్ట్ అయినట్లు ప్రకటించింది. ఇక ఈ సినిమాలో రష్మిక మందన్న అతిథి పాత్రలో నటించగా, దివ్యాంశ కౌశిక్ ఒక ముఖ్యమైన పాత్రను పోషించింది.

# అసూయ పుట్టిస్తున్న.. అనసూయ




అనసూయ ఏమి చేసినా వైరల్ అవుతూ ఉంటుంది. ఏదైనా మాట్లాడినా లేక ఫోటో ఏదైనా పెట్టినా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ఉంటాయి. ఇప్పుడు ఆమె తాజాగా తన ఫోటోలు అభిమానుల కోసం తన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు, అవి వైరల్ అవుతూ వున్నాయి. అనసూయ సామాజిక మాధ్యమాల్లో ఎటువంటి ఫోటో పెట్టినా వైరల్ అవుతూనే ఉంటుంది. అందులోకి కొంచెం అందంగా, గ్లామర్ గా వుండే ఫోటోలు పెడితే ఇంకా చెప్పనక్కరలేదు, అవి ఇంకా వైరల్ అవుతాయి. కొన్ని రోజుల క్రితం అనసూయ ఒక బ్యూటీ సలోన్ ప్రారంభోత్సవానికి వెళ్లారు. అక్కడ సలోన్ ఓపెన్ చేసినప్పుడు ఫోటోలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ తరువాత అనసూయ తన ఫోటోలు కూడా కొన్ని తన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అవి కూడా ఇప్పుడు బాగా వైరల్ అవుతున్నాయి. అలాగే ఈమధ్య ఒక యూట్యూబ్ ఛానెల్ కి ఇంటర్వ్యూ కూడా ఇచ్చిన అనసూయ తన సామాజిక మాధ్యమాల్లో ఎందుకు ఏడుస్తున్న వీడియోస్ పెట్టవలసి వచ్చిందో కూడా వివరణ ఇచ్చారు. అలాగే ఈమధ్యనే ఆమె నటించిన 'రజాకార్' సినిమా విడుదలై పాజిటివ్ రివ్యూస్ తెచ్చుకుంది. అందులో అనసూయ ఒక పాటలో కనిపించడమే కాకుండా, ఆ తరువాత వచ్చిన ఒక గొప్ప సన్నివేశంలో నటించి మెప్పించింది. ఈ సినిమాలో ఆమె పాత్ర నిడివి చాలా చిన్నదే అయినా అనసూయకి పేరు మాత్రం బాగా వచ్చింది. ఇప్పుడు 'పుష్ప 2' సినిమాలో కూడా అనసూయ కనబడబోతోంది. ఇందులో ఒక నెగటివ్ పాత్రలో అనసూయ కనపడుతుంది. 'పుష్ప' మొదటి భాగంలో అనసూయ పాత్ర కన్నా, రెండో పార్టులో ఇంకా ఎక్కువ ఉంటుంది అని అంటున్నారు. సుకుమార్ ఈ సినిమాకి దర్శకుడు, అల్లు అర్జున్ కథానాయకుడు. రష్మిక మందన్న కథానాయిక. ఆగస్టు 15న ఈ సినిమా విడుదలవుతోంది.ఏప్రిల్ 8న కథానాయకుడు అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుండి ఒక టీజర్ వస్తుంది అని ఈ చిత్ర నిర్వాహకులు ప్రకటించారు, ఈ సినిమా కోసం అర్జున్ అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. మరి ఈ టీజర్ లో ఈ సినిమాలో వున్న మిగతా పాత్రలు అంటే అనసూయ, రావు రమేష్, ఫహద్ ఫాజిల్ లను కూడా చూపెడతారా, లేక ఒక్క అల్లు అర్జున్ నే చూపిస్తారా అనేది ఏప్రిల్ 8న తెలుస్తుంది.

# ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

## పాల్గొన్న ప్రముఖులు

## మహాన్నదానాలతో పరవశించిన భక్తులు






**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని శిరంగి రాజారాం తోటలో నూతన ఏర్పాటు చేసిన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం శ్రీదేవి, భూదేవి, నాభిశిల ప్రతిష్టాపనతో మహోత్సవ కార్యక్రమం ముగిసింది. పూజారి బ్రహ్మశ్రీ భాస్కరాచార్యులు వారి బృందం నాలుగు రోజులుగా పెద్ద ఎత్తున పూజలు, హోమాలు, యాగాలు నిర్వహించారు. వీటిలో స్థానికులను, బొడ్రాయి కమిటీని భాగస్వామ్యం చేయడంతో భక్తులు తరించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు ముత్యం, పగడం, నవదాన్యాలను సమర్పించుకున్నారు. ప్రతి ఇంటినుంచి ఒక బూడిద గుమ్మడి కాయ తెచ్చుకొని పూజలు నిర్వహించిన అనంతరం ఇంటి గుమ్మానికి కట్టుకున్నారు. మధ్యాహ్నం బొడ్రాయి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. బొడ్రాయి పరిధిలోని ప్రతి ఒక్కరికి అన్న ప్రసాదం అందించాలన్న లక్ష్యంతో శిరంగి రాజారాం తోటలో ఎనిమిది ప్రాంతాల్లో మహా అన్నదానం కౌంటర్లను ఏర్పాటు చేశారు. చివరి రోజు వరంగల్ తూర్పు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ హాజరై బొడ్రాయి కమిటీని అభినందించారు. గ్రామ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నిర్వహించే ఇలాంటి బొడ్రాయి ఉత్సావాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయం అన్నారు. శిరంగి రాజారాం తోట ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మా రవి, బొడ్రాయి కమిటీ అధ్యక్షులు తాటిపాముల భిక్షపతి, బొడ్రాయి కమిటీ ప్రధాన కార్యదర్శి చిలువేరు రవీందర్, పరదేశి రాజేష్, బొల్లం మధు, చిలువేరు రాజేందర్, కొండ సుధాకర్, మీరిపెల్లి వినయ్, బైరి ప్రతాప్, బుధారపు హరికృష్ణ, ఊరుగొండ సతీష్, బండారి పూర్ణచందర్, వల్పదాసు మధు, కోదాటి సురేష్, ఆడెపు జగన్, పోరండ్ల ఓం ప్రకాష్, బెజ్జాల శ్రవణ్ కుమార్ పాల్గొని బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవాన్ని ప్రజల యొక్క భాగస్వామ్యంతో విజయవంతం చేసినట్లు ప్రకటించారు.

# గజవెల్లి స్పిన్నింగ్ మిల్స్ ఎండి వెంకట్ మృతి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రముఖ పారిశ్రామికవేత్త, మృదుస్వభావి, తెలంగాణ కాటన్ జిన్నర్స్ పారిశ్రామికవేత్తలందరితో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న గజవెల్లి స్పిన్నింగ్ మిల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ గురువారం అకాల మరణం చెందారు. కాగా వెంకట్ అకాల మరణం కాటన్ పరిశ్రమకే తీరని లోటని తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ తదితరులు తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

# సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

## హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లక్ష్యాలను సంబంధిత రైస్ మిల్లర్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయడంపై గురువారం జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ లక్ష్యాన్ని ఎప్పటి వరకు పూర్తి చేస్తారనే వివరాలను ఆయా రైస్ మిల్లుల యజమానులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయడంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ప్రతిరోజు లక్ష్యం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మహేందర్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారులు కృష్ణ, రోజా రాణి, రమేష్, సత్యనారాయణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, జగన్, రా రైస్, పారాబాయిల్డ్ రైస్ మిల్లర్స్ యజమానులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు నిర్వహించే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతిక అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రనాయక్ అన్నారు. సబండ వర్గాల అభ్యున్నతి కులమతాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. స్థానిక ఉస్మానియా మసీద్ లో గురువారం ముస్లింలతో కలిసి ప్రార్ధన చేసిన అనంతరం అల్పహారం తినిపించి ఉపవాస దీక్షలను విరమింప చేసారు. అనంతరం ఆల్ ఫలా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్ని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఫలా యూత్ ప్రెసిడెంట్ యూనిస్ అబ్దులా, ఖాదర్, ఫరీద్, గౌస్, వహీద్, రఫీ, బషీర్, యూనిస్, గఫూర్, మునీర్, సర్వర్ పాల్గొన్నారు.

# తుది ఓటరు జాబితా అందజేత




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను గురువారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి అందజేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. హనుమకొండ జిల్లాకు సంబంధించి 43,483 మంది పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారని అడిషనల్ కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డాక్టర్ కె.నారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ.శ్రీనివాసరావు, ఎ.విద్యాసాగర్, రావు అమరేందర్ రెడ్డి, ఎం.మణి, బి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మంత్రి సీతక్క

## నిరుపేద యువతి పెళ్లికి చేయూత

## కృతజ్ఞతలు తెలిపిన స్థానిక కాంగ్రెస్ నాయకులు

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు మండలంలోని గుర్తురు తండా గ్రామానికి చెందిన నిరుపేద యువతి మూడు అఖిల పెళ్లికి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డాక్టర్ దనసరి సీతక్క చేయుతనిచ్చారు. నిరుపేద కుటుంబానికి చెందిన అఖిల ఇటీవలి కాలంలో తల్లిదండ్రులను కోల్పోగా, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పందించారు. మంత్రి సీతక్క దృష్టికి తీసుకుపోగ, వెంటనే స్పందించిన మంత్రి గురువారం జరుగనున్న అఖిల వివాహానికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ...పేదింటి ఆడ బిడ్డ పెళ్లికి సాయం చేసినందుకు మంత్రి సీతక్క కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవి చందర్, కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నల్లెల భరత్ కుమార్, సహకార సంఘం చైర్మన్ బొక్క సత్తి రెడ్డి, కొండం రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అమర్ సింగ్ నసీరుద్దీన్, గ్రామ కమిటీ అధ్యక్షులు జోష్, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆజ్జు, యూత్ కాంగ్రెస్ ములుగు పట్టణ అధ్యక్షులు అభినవ్, గుంటోజు నిరంజన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల్లో..

## జూన్ 10లోగా పనులు పూర్తి చేయాలి

## ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు

**వరంగల్ వాయిస్, పరకాల :** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జూన్ 10లోగా పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరకాల మండల పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు మండల విద్యాశాఖ అధికారి ఎస్.రమాదేవి అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఎంపీడీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి వసతి తదితర అవసరాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సురేందర్, సాంబయ్య, మధు, గౌస్, తిరుపతి రావు, అశోక్ ఏఈ రాజు, ఐకేపీ ఏపీఎం క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com